నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
18 సెప్టెంబర్ 2024
పేజీలు 8

### తగ్గిన ఆహార వ్యయం

గృహ రంగ ఆహారంపై చేసే వ్యయం తగ్గిందని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి పేర్కొంది. ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న 20% కుటుంబాల్లో 50% ఆహార వ్యయం తగ్గడం కనిపించిందని పేర్కొంది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజనతో పాటు ఇతర ఆహార సబ్సిడీ పథకాలు ఇందుకు దోహదం చేశాయని వెల్లడించింది. ఆహార ధాన్యాలకు వ్యయం తగ్గడంతో ఆ మొత్తంతో గుడ్లు, మాంసం వంటి పోషకాహార పదార్థాలు తినడంతో పోషక విలువలు కూడా పెరిగాయని వెల్లడించింది.

## రోజులు-ప్రాముఖ్యం

**సెప్టెంబర్ 12**
- ఏటా సెప్టెంబర్ 12న ఐక్యరాజ్య సమితి దక్షిణ-దక్షిణ సహకార రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'ఎ బెటర్ టుమారో త్రూ సౌత్-సౌత్ కో ఆపరేషన్'. అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమినే సౌత్-సౌత్ అని పిలుస్తారు.

**సెప్టెంబర్ 9**
- విద్యా రంగంపై దాడి జరగకుండా రక్షించే రోజుగా సెప్టెంబర్ 9ని ఐక్యరాజ్య సమితి గుర్తించింది.

**సెప్టెంబర్ 8**
- అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా ఏటా సెప్టెంబర్ 8న నిర్వహిస్తారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఏ విధంగా విద్య తోడ్పడుతుందో తెలిపేందుకు ఈ రోజును ఎంపిక చేశారు. 1967 నుంచి నిర్వహిస్తున్నారు.

**సెప్టెంబర్ 7**
- ప్రపంచ భద్రత, చట్టం అమల్లో పోలీసుల పాత్రను తెలిపేందుకు ఏటా సెప్టెంబర్ 7న అంతర్జాతీయ పోలీసుల సహకార రోజుగా నిర్వహిస్తారు.

## క్రీడలు

**పతాకధారులు**
- హర్విందర్ సింగ్, ప్రీతీ పాల్ పారిస్ పారాలింపిక్స్ ముగింపు వేడుకల్లో పతాకధారులుగా వ్యవహరించారు. హర్విందర్ ఆర్చరీ క్రీడాకారుడు కాగా, ప్రీతిపాల్ స్ప్రింటర్. ఈ క్రీడలు ఆగస్ట్ 28న ప్రారంభమై సెప్టెంబర్ 8న ముగిశాయి.

**ఒలింపిక్స్ బిడ్డింగ్**
- 2030 యూత్ ఒలింపిక్స్‌తో పాటు 2036 వేసవి ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నట్లు కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో, 2032లో ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో ఒలింపిక్స్ క్రీడలు ఇప్పటికే షెడ్యూల్ అయ్యాయి.

**యోగాసన**
- 2026 ఏషియన్ క్రీడల్లో డెమోన్‌స్ట్రేషన్ క్రీడగా యోగాసనాలను గుర్తించారు. ఈ క్రీడలు జపాన్‌లోని ఐచి-నగోయాలో నిర్వహించనున్నారు.



## అంతర్జాతీయం

**ఐక్యరాజ్యసమితి సాధారణ సభ**
- ఐక్యరాజ్యసమితి 79వ సాధారణ సభ సమావేశంలో పాలస్తీనా పాల్గొంది. కేవలం సార్వభౌమ దేశాలకు మాత్రమే చోటు ఉన్న ఈ వ్యవస్థలో పాలస్తీనాకు అనుమతి ఇవ్వడం పట్ల ఇజ్రాయెల్ నిరసన వ్యక్తం చేసింది. ఐక్యరాజ్యసమితిలో ప్రస్తుతం 193 దేశాలకు మాత్రమే సభ్యత్వం ఉంది. పాలస్తీనాకు లేదు.

**ఢిల్లీ ప్రకటన**
- పౌర విమాన యాన రంగంలో ప్రాంతీయ సహకారం, సుస్థిరాభివృద్ధికి తోడ్పాటు, కొత్త సవాళ్లు ఎదుర్కోవడం అంటూ ఆసియా పసిఫిక్ దేశాల పౌర విమాన యాన సమావేశంలో ప్రకటించారు. ఈ సమావేశం సెప్టెంబర్ 11, 12 తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించారు. అందుకే ఈ ప్రకటనను ఢిల్లీ ప్రకటనగా పేర్కొన్నారు. ఆసియా, పసిఫిక్ సభ్య దేశాల చైర్మన్‌గా భారత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు ఎన్నికయ్యారు.



**నేపాల్**
- హర్యానాలోని గురుగ్రామ్ కేంద్రంగా పని చేసే అంతర్జాతీయ సౌర కూటమిలో నేపాల్ చేరింది. ఇందులో సభ్యత్వం పొందిన 101వ దేశం ఇదే.

**అమెరికా**
- యుద్ధ్ అభ్యాస్ పేరుతో భారత్, అమెరికా సంయుక్తంగా సైనిక విన్యాసాన్ని నిర్వహిస్తున్నాయి. సెప్టెంబర్ 9న ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 22 వరకు ఇది కొనసాగనుంది. రాజస్థాన్‌లోని మహజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజెస్‌లో దీన్ని నిర్వహిస్తున్నారు.



**మిగా**
- ప్రపంచ బ్యాంక్‌కు ఉన్న విభాగాల్లో మిగా ఒకటి. దీని పూర్తి రూపం- మల్టీలేటరల్ ఇన్వెస్ట్‌మెంట్ గ్యారంటీ ఏజెన్సీ. అంతర్జాతీయ సౌర కూటమితో కలిసి మిగా ఒక నిధిని ఏర్పాటు చేసింది. సౌరకూటమి సాంకేతిక సాయాన్ని అందించగా, మిగా నిధుల సమీకరణకు తోడ్పడుతుంది. మొదట సబ్ సహారా ప్రాంతంలో దృష్టి సారిస్తారు. ఆ తర్వాత క్రమంగా ఇతర దేశాలకు విస్తరిస్తారు.

**యూఏఈ**
- భారత్, యూఏఈ పౌర అణు సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అలాగే అబు ధాబి నేషనల్ ఆయిల్ కంపెనీతో, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కూడా ఒప్పందం కుదుర్చుకుంది. ఎల్ఎన్‌జీ సరఫరాకు సంబంధించింది ఇది. అబు ధాబి ఆన్‌షోర్ బ్లాక్ 1కు సంబంధించి ఊర్జా భారత్, ఏడీఎన్‌వోసీ మధ్య మరో ఒప్పందం కుదిరింది. యూఏఈకి చెందిన అబు ధాబి డెవలప్‌మెంటల్ హోల్డింగ్ కంపెనీతో కలిసి భారత్‌లో ఆహార పార్కులను అభివృద్ధి చేసేందుకు గుజరాత్ ప్రభుత్వంతో మరో ఒప్పందం కూడా కుదిరింది.

## జాతీయం

**స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డులు**
- వాయు నాణ్యత ఆధారంగా స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ అవార్డులను ప్రకటించారు. అవార్డులు పొందిన నగరాలు..
- పది లక్షలకు మించి జనాభా ఉన్న జాబితాలో తొలి మూడు నగరాలు- 1. సూరత్ 2. జబల్‌పూర్ 3. ఆగ్రా. ఈ జాబితాలో హైదరాబాద్ 25వ స్థానంలో ఉంది.
- 3 నుంచి 10 లక్షల జనాభా ఉన్న జాబితాలో తొలి మూడు నగరాలు- 1. ఫిరోజాబాద్, అమరావతి (మహారాష్ట్ర) 3. ఝాన్సీ
- 3 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్న జాబితాలో తొలి మూడు నగరాలు- 1. రాయ్ బరేలీ 2. నల్లగొండ 3. నలఘర్. ఇదే జాబితాలో సంగారెడ్డి 8వ స్థానంలో ఉంది.



**సిలికాన్ కార్బైడ్ తయారీ కేంద్రం**
- దేశంలో తొలి సిలికాన్ కార్బైడ్ తయారీ కేంద్రాన్ని ఒడిశాలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు ఆర్ఐఆర్ సంస్థ రూ.620 కోట్లు విస్తరించనుంది.

**పట్టణాల్లో ఆయుష్ సేవలు**
- పట్టణాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆయుష్ సేవలను అందుబాటులోకి తేవాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలో ఈ తరహా నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రం ఇదే.



**ప్రధాన పోర్టుగా గలాథియా**
- అండమాన్ నికోబార్‌లోని గలాథియా బేను ప్రధాన పోర్టుగా కేంద్రం ప్రకటించింది. 1908లోని భారత పోర్టుల చట్టం సెక్షన్ 5 ప్రకారం కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీన్ని త్వరలో ఇంటర్నేషనల్ కంటెయినర్ ట్రాన్సిప్‌మెంట్ పోర్టుగా కూడా అభివృద్ధి చేయనున్నారు.

**టీల్ కార్బన్**
- దేశంలో తొలిసారి టీల్ కార్బన్ అధ్యయనాన్ని కెలాడియో జాతీయ పార్కులో నిర్వహించనున్నారు. ఇది రాజస్థాన్‌లో ఉంది. మంచినీటి చిత్తడి నేలలు, సముద్ర ఆధారితం కాని చిత్తడి నేలల్లో ఉండే కార్బన్‌ను టీల్ కార్బన్ అని పిలుస్తారు. పర్యావరణ మార్పు, సవాళ్లను ఇవి ఏ విధంగా ఎదుర్కొంటాయో చూడటమే ఈ అధ్యయన ఉద్దేశం.

**గతిశక్తి విద్యాలయంతో ఒప్పందం**
- భారత సైన్యం, భారత వైమానిక దళం సంయుక్తంగా గతిశక్తి విద్యాలయంతో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. నైపుణ్యాలు, సామర్థ్య నిర్వహణకు సంబంధించిన ఒప్పందం ఇది. లాజిస్టిక్స్ నిర్వహణలో కూడా సైన్యానికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు గతిశక్తి విద్యాలయం కృషి చేస్తుంది. ఇది గుజరాత్‌లోని వడోదర కేంద్రంగా పని చేస్తుంది.

## వార్తల్లో వ్యక్తులు

**అమిత్ షా**
- అధికార భాషల పార్లమెంటరీ కమిటీ చైర్పర్సన్‌గా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఎన్నికయ్యారు.

**రణధీర్ సింగ్**
- కువైట్ కేంద్రంగా పనిచేసే ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఏషియాకు అధ్యక్షుడిగా రణధీర్ సింగ్ ఎన్నికయ్యారు. ఈ పదవిని చేపట్టనున్న తొలి భారతీయుడు ఆయన.

**తుహిన్ కాంత పాండే**
- కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా 1987 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన తుహిన్ కాంత పాండే నియమితులయ్యారు.



**టెబౌన్**
- అల్జీరియా అధ్యక్షుడిగా అబ్దెల్‌మద్జిద్ టెబౌన్ ఎన్నికయ్యారు. ఆయనకు మద్దతుగా 95% ఓట్లు పడ్డాయి. ఆయన ఎన్నిక కావడం వరుసగా ఇది రెండోసారి.

**సత్యనారాయణ**
- ఉద్యోగుల భవిష్య నిధికి సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి అదనపు కేంద్ర పీఎఫ్ కమిషనర్‌గా ఎంఎస్‌కేవీవీ సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ హోదాలో బాధ్యతలు స్వీకరించిన తొలి తెలుగు వ్యక్తి.

**ప్రశాంతి రామ్**
- భారత సంతతికి చెందిన ప్రశాంతి రామ్ సింగపూర్‌లో అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. 'నైన్ యార్డ్ శారీస్' అనే పుస్తక రచనకు ఆమెకు సింగపూర్ సాహిత్య పురస్కారం లభించింది.



## తెలంగాణ

**సౌర విద్యుత్ పైలెట్ ప్రాజెక్ట్**
- నాగర్ కర్నూలు జిల్లా కొండారెడ్డిపల్లిలో సౌర విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఇది ప్రయోగాత్మకంగా ఏర్పాటు కానుంది. ఇక్కడ సఫలమైతే రాష్ట్రంలోని అన్ని పల్లెల్లోనూ విస్తరిస్తారు.



**మహిళలకు విద్యుత్ ఆటోలు**
- పొదుపు సంఘాల మహిళలకు పర్యావరణ హిత విద్యుత్ ఆటోలను సమకూర్చే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. ప్రయోగాత్మకంగా జనగామ జిల్లా పాలకుర్తిలో దీన్ని ఇవ్వనున్నారు. పొదుపు సభ్యురాలికి లేదా ఆమె కుటుంబంలో లైసెన్స్ ఉన్న వారికి ఈ వాహనాన్ని అందిస్తారు. స్త్రీనిధి రూపేణ అందించి ప్రతి నెలా వడ్డీతో సహా చెల్లించాలి.

**ఎస్సీ వర్గీకరణపై కమిటీ**
- ఎస్సీ వర్గీకరణ అంశానికి సంబంధించి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటయ్యింది. దీనికి కోచైర్మన్‌గా దామోదర రాజనర్సింహ వ్యవహరిస్తారు. సభ్యులుగా శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవి నియమితులయ్యారు.

**ప్రత్యేక అవార్డ్**
- సైబర్ నేరాల విశ్లేషణ విధానంలో అద్భుతమైన ప్రతిభ చూపిన తెలంగాణకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక అవార్డును ప్రదానం చేసింది. సైబర్ నేరాలు, నేరముఠాల విశ్లేషణ, నేరగాళ్ల కదలికలు పసిగట్టి, వారిని కట్టడి చేసేందుకు ఐ4సీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా సమన్వయ విధానాన్ని అమలు చేస్తున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇందులో పురోగతిని చూపుతూ తాము సేకరించిన సమాచారాన్ని ఇతర రాష్ట్రాలతో పంచుకుంటూ నేరగాళ్లను అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. దీన్ని గుర్తించి హోం మంత్రిత్వ శాఖ తెలంగాణకు ప్రత్యేక అవార్డును అందజేసింది.



**కమిటీల నియామకం**
- రాష్ట్ర శాసనసభలో ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, అంచనాల కమిటీ చైర్‌పర్సన్‌గా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య వ్యవహరించనున్నారు.

**జన సాంద్రత 386**
- తెలంగాణలో జన సాంద్రత 386గా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 4885, గ్రామీణ ప్రాంతాల్లో 210 ఉంది. తెలంగాణలో 2020 నాటికి జననాల రేటు 16.4గా నమోదయ్యింది. గ్రామాల్లో 16.8, పట్టణాల్లో 15.9గా ఉంది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

